క్లుప్తంగా

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



పాఠం చదివిస్తున్న ఎంఈవో శ్రీకాంత్

బజార్‌హత్నూర్: మండలంలో 64 పాఠశాలల్లో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో శ్రీకాంత్ అన్నారు. సోమవారం గిర్నూర్, బలన్‌పూర్ పాఠశాలల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యతగా ఉండాలని, వంట గది, డార్మేటరి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఉపాధ్యాయులు సదానందం, నరేశ్, శారద పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



బావి చుట్టూ కూలిన గోడ

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని గొండ్‌గూడలో పురాతన బావి ప్రమాదకరంగా మారింది. గతంలో అధికారులు బావిపై ఇనుప జాలి వేసి జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రస్తుతం వరద నీటితో బావి గోడ కూలడంతో ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి బావికి మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

జైనథ్: పదోన్నతిపై ఇతర పాఠశాలకు వెళ్తున్న మండలంలోని భోరజ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిందం దేవిదాస్‌ను ఉపాధ్యాయులు, స్థానికులు ఘనంగా సన్మానించారు. ఇటీవల నిర్వహించిన బదిలీల్లో స్కూల్ అసిస్టెంట్‌గా బేల మండలం సిర్సన్నకు వెళ్లిన ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ కవిత గన్నోజీ, రాజేశ్వర్, భగవాన్‌రెడ్డి, కిష్టారెడ్డి, అశోక్ రెడ్డి, మహేందర్ యాదవ్, సర్వేశ్వర్ రెడ్డి, రాజారెడ్డి, సాయి వర్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ విద్య విధానం, నూతన పాఠ్య పుస్తకాల్లో జరిగిన మార్పులపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రెడ్డి సంక్షేమ భవనంలో ఆదిలాబాద్‌అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో పనిచేసే అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు సీడీపీవో వనజ తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఫర్హా, నీరజ, విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు రాధ పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి

బోథ్: మండల కేంద్రంలో విశ్వకర్మ యోజన శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా స్క్రీనింగ్ కమిటీ సభ్యులు గొర్ల రాజుయాదవ్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షతన నిర్వహించిన విశ్వకర్మ యోజన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నూతనంగా దరఖాస్తులు చేసుకున్న వారికి అవకాశం ఇవ్వాలని, మరిన్ని వృత్తులను పథకంలో చేర్చాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిని కలిసిన సుహాసిని రెడ్డి

ఆదిలాబాద్: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి సోమవారం ఢిల్లీలో కలిశారు. జిల్లాలో రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి సంబంధించి వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ రూరల్ మండల పరిధిలో రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపడతామని స్థానిక గిరిజన రైతుల నుంచి వ్యవసాయ భూములను తీసుకోవడం జరిగిందన్నారు. అయితే ఇప్పటివరకు ఫ్యాక్టరీ నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు రాములు, సలేందర్ శివయ్య, తదితరులు ఉన్నారు.

విద్యార్థి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూ హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన ఓ విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. మావల మండలంలో గల మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసింది. ఆదివారం టీసీ కోసం పాఠశాలకు వెళ్తునని కుటుంబసభ్యులకు చెప్పి తిరిగి రాలేదు. దీంతో విద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బెడ్ పద్ధతిలో పత్తి సాగు



తాంసి శివారులో బెడ్‌పద్ధతిలో సాగు చేస్తున్న పత్తి

- ఆసక్తి చూపుతున్న రైతులు
- తెగుళ్లు, కలుపు మొక్కల బెడద తక్కువ
- అధిక దిగుబడి సాధించే అవకాశం

తాంసి: జిల్లాలో అత్యధికంగా రైతులు పత్తి పంట సాగు చేస్తారు. ప్రతి ఏటా సాగుచేసే పద్ధతిలో సాగు చేస్తే అధికంగా చీడపీడలు, తెగుళ్ల సోకి దిగుబడిపై ప్రభావం చూపుతుంది. అయినప్పటికీ రైతులకు ప్రత్యామ్నాయ పరిస్థితి లేక తప్పనిసరిగా పత్తి సాగు చేస్తున్నారు. సాగులో మూస పద్ధతికి స్వస్తి చెప్పి బెడ్ పద్ధతిలో సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ పద్ధతితో కలుపుతీత, మందుల పిచికారీ ఎక్కువగా అవసరం లేక పంట ఏపు పెరుగుతుంది. దిగుబడి సైతం అధికంగా వచ్చే అవకాశం ఉంది.

సులువుగా పంట సాగు..

బెడ్ పద్ధతిలో పత్తి సాగు చేయడం ద్వారా సులువుగా దిగుబడి సాధించవచ్చు. పాత పద్ధతిలో విత్తనాలను వేసేందుకు కాడెడ్లతో పాటు అరక సాయంతో గీతలు గీయాల్సి వస్తోంది. వీటితో పాటు పంట ఏపుగా పెరిగిన తరువాత కలుపు మొక్కల నివారణకు కూలీలతో పాటు గుంటుక సాయంతో కలుపు తీసి వేయాల్సి ఉంటుంది. వర్షాకాలంలో నీరు నిలిచి తెగుళ్ల సోకే ప్రమాదం ఉంది. బెడ్ పద్ధతిలో పత్తి వేయడం వలన కాడెడ్లు, అరకతో ఎలాంటి పని ఉండదు. గట్టుపైన విత్తడం వలన మొక్కలు ఏపుగా పెరుగుతాయి. పంట చేలలో నీరు నిలిచే అవకాశం ఉండదు. బెడ్‌పద్ధతిలో పత్తి సాగు చేయడం వలన యంత్రాల సాయంతో పనులు చేసుకునే అవకాశం ఉంటుంది.

అధిక దిగుబడి..

సాధారణ పద్ధతిలో సాగు చేసే పత్తి కంటే ఎక్కువ దిగుబడి వస్తుంది. ఎకరానికి దాదాపుగా 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. పెట్టుబడి ఖర్చులు కూడా అంతగా ఉండవని పేర్కొంటున్నారు. తాంసి, భీంపూర్, తలమడుగు మండలాల్లో రైతులు బెడ్‌పద్ధతిలో పత్తి సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు.

సులువుగా పత్తి సాగు



బెడ్‌పద్ధతిలో పత్తి సాగు చేయడం సులువుగా ఉంటుంది. కాడెడ్లు, అరకతో ఎలాంటి అవసరం లేకుండా పంట సాగు చేయవచ్చు. ఈ పద్ధతిలో యంత్రాల ద్వారానే పనులు చేసుకునే అవకాశం ఉంది.
– హరీష్ రెడ్డి, జామిడి రైతు

నూతన పద్ధతుల్లో సాగు చేయాలి



రైతులు పాత పద్ధతుల్లో కాకుండా నూతన పద్ధతుల్లో పంటలు సాగు చేస్తూ.. అధిక దిగుబడులు సాధించవచ్చు. ఇప్పటికే గ్రామాల వారీగా పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాం.
– రవీందర్, వ్యవసాయాధికారి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ఎంపీపీ అజాడే జయశ్రీ
- సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



ఎంపీపీ, జెడ్పీటీసీలను సన్మానిస్తున్న ఎంపీడీవో

బజార్‌హత్నూర్: వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ అజాడే జయశ్రీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటిని క్లోరినేషన్ చేసి తాగునీరు అందించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చూడాలన్నారు. ఎంపీహెచ్‌వో ప్రకాష్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల నివారణకు మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఏడు హెల్త్ సబ్‌సెంటర్లలో మందులు అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ హీరాలాల్, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్, ఏఈలు శ్రీనివాస్, వెంకటేశ్, పద్మ, ఎంపీవో అతుల్‌కుమార్, ఏవో ప్రమోద్‌రెడ్డి, ఎంపీహెచ్‌వో ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేసి రైతులకు అండగా ఉంటాం



క్షీరాభిషేకం చేస్తున్న అడ్డి భోజారెడ్డి

తాంసి: రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఏక కాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని, ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలుస్తామని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ నిర్ణయాన్ని హర్షిస్తూ సంబురాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశాఉ. అనంతరం టపాసులు పేల్చి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ సంతోశ్, మండల నాయకులు శ్రీధర్ రెడ్డి, రామన్న యాదవ్, నరేశ్, చిన్న రాంరెడ్డి, లింగారెడ్డి, వెంకట్ రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక పోటీలు



విద్యార్థులను పరీక్షిస్తున్న ఎంఈవో జయశీల

ఆదిలాబాద్: రాష్ట్రంలోని హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించి సోమవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆదిలాబాద్ రూరల్, అర్బన్ మండలాలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన పోటీలను ఎంఈవో జయశీల పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల స్థాయిలో 25 మంది విద్యార్థులు ఎంపిక పోటీల్లో పాల్గొనడం జరిగిందన్నారు. మండలస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక అవుతారని వెల్లడించారు. కార్యక్రమంలో పీఈటీ స్వామి, క్రీడా పాఠశాల శిక్షకులు రాజు, రమేశ్, కబీర్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలి



మాట్లాడుతున్న సురేశ్

ఎదులాపురం: వ్యవసాయ కార్మికులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సమగ్ర చట్టం తేవాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొడప సురేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమరం భీంభవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో 60 శాతం మంది వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వారిలో 14 కోట్ల మంది వ్యవసాయ కార్మికులు ఉంటారని తెలిపారు. అయితే చాలీచాలని కూలీలు, వేతనాలతో వ్యవసాయ రంగ కార్మికులు దుర్భర జీవనస్థితిగతులను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో వారి సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలని, కనీసం రోజుకు 600 కూలీగా, గౌరవప్రదమైన వేతనాలు చెల్లించేలా చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బుచ్చిరాం, శ్యాంసుందర్, జగతిరావు, భీమ్రావు, తదితరులు పాల్గొన్నారు.

అటవీ అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు



నిరసన తెలుపుతున్న కేశవపట్నం గ్రామస్తులు

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ అటవీ పరిధిలోని బాహొజిపేట్ 174 కంపార్ట్‌మెంట్‌లో పోడు భూముల్లో మొక్కలు నాటుతున్న అటవీ అధికారులను సోమవారం కేశవపట్నం గ్రామస్తులు అడ్డుకున్నారు. గత కొంత కాలంగా 174 కంపార్ట్‌మెంట్‌లో పోడు భూముల్లో అటవీశాఖ అధికారులు పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నారు. కేశవపట్నం గ్రామానికి చెందిన పలువురు రైతులు మొక్కలు నాటాడాన్ని అడ్డుకొని నిరసన తెలిపారు. గ్రామ మాజీ ఉప సర్పంచ్ అజీం సుల్తాన్ మాట్లాడుతూ.. గత నలభై సంవత్సరాల నుంచి పోడు వ్యవసాయ చేసుకుంటున్నారని, ఇప్పుడు అధికారులు వచ్చి మొక్కలు నాటుతున్నారని ఆరోపించారు. అటవీశాఖ మంత్రి కొండ సురేఖ పోడు భూముల విషయంలో రైతులను ఇబ్బందులు పెట్టవద్దని ఆదేశాలు ఇచ్చినా.. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పోడు రైతులకు న్యాయం చేయాలన్నారు.

'వాసవి విద్యానికేతన్ పాఠశాలలో చేర్పించవద్దు'

బోథ్: మండల కేంద్రంలోని వాసవి విద్యానికేతన్ పాఠశాల 2024–25 విద్యా సంవత్సరానికి గుర్తింపునకు సంబంధించి రెన్యువల్ చేసుకోలేదని, ఆ పాఠశాలలో విద్యార్థులను చేర్పించవద్దని బోథ్ మండల విద్యాధికారి భూమారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

బేల: మండల కేంద్రంలోని గణేష్ గార్డెన్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ ఉంటుందని మండల తహసీల్దార్ సవాయిసింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని పేర్కొన్నారు. లబ్ధిదారులందరు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు 'రైతునేస్తం'

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు రైతువేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు రైతునేస్తం కార్యక్రమం ద్వారా ప్రత్యేక ప్రసార కార్యక్రమం ఉంటుందని ఏవో జాదవ్ కైలాస్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు వ్యవసాయ సంచాలకులు డాక్టర్ గోపి పరిచయ కార్యక్రమం, 10.30 గంటలకు విత్తనాల ఎంపికపై అవగాహన, 11 గంటలకు వ్యవసాయశాఖ మంత్రి రైతులను ఉద్దేశించి ప్రసగించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: నిషేధిత గుట్కాను అక్రమంగా నిల్వ ఉంచిన ముగ్గురు వ్యక్తులపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి కేసు నమోదైనట్లు వన్‌టౌన్ ఎస్సై హబీబ్ ఖాన్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షాపూర్‌లో గల ఎస్‌కే ట్రేడర్స్ యజమాని నదీమ్ ఖాన్ వద్ద రూ.3వేల విలువ గల గుట్కా, ఏఆర్ ట్రేడర్స్ యజమాని ఎస్‌కే లతీఫ్ వద్ద రూ.6,590, సోను ట్రేడర్స్ యజమాని రషీద్ వద్ద నుంచి రూ.6,250 విలువ గల గుట్కా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ జాహీర్ రంజానీ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలం పరిధిలోని చాందా (టి) వద్ద గల మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఇటీవల అందిన ఫిర్యాదుల నేపథ్యంలో అక్కడకు వెళ్లి పరిస్థితులను పర్యవేక్షించారు. ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట షకీల్, తదితరులు ఉన్నారు.

బీడీ కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీడీ కార్మికులు

బోథ్: బీడీ పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, వారికి ఎలాంటి ఆంక్షలు లేకుండా పెన్షన్లు మంజూరు చేయాలని బీడీ కార్మిక సంఘం ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె. రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కుచులాపూర్ గ్రామంలో బీడీ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్మికుల వేతనాల పెరుగుదల కార్మికుల విజయమన్నారు. కార్యక్రమంలో బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజు, ఆడేల్లు, సంతోష్, శోభ, రాజేందర్, గోదావరి బాయి, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: విద్యార్థులు కష్టపడి చదివి, తల్లిదండ్రుల ఆశయాలను సాధించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని బోరిగామ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో రూ 13.50 లక్షలతో నిర్మించనున్న ప్రయోగశాల భవనానికి భూమి పూజ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉంటూ.. వ్యవసాయం చేస్తూ.. తల్లితండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపిస్తారని వారి ఆశయాలకు అనుగుణంగా కష్టపడి చదువుకొని ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, గాడ్గే సుభాష్, పాండురంగ్, మహేందర్ రెడ్డి, నర్వాడే రమేశ్, సురేందర్‌రెడ్డి, పోశాలు, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌రూరల్: భూమండలానికి నష్టం కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరుతూ మండలంలోని అంకోలి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు గ్రామంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఎన్జీసీ ఏకో క్లబ్ విద్యార్థులచే సింగిల్ యూస్ ప్లాస్టిక్ నివారించడం అనే కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ బాటిల్స్, కవర్స్, తదితర వాటి వినియోగం తగ్గించాలని నినాదాలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంటె నర్సయ్య మాట్లాడుతూ.. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణహితమైన జూట్ బ్యాగ్స్ వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ కోవ కలేందర్, సుభాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న యశోద

తాంసి: మహిళ చట్టాలతో పాటు హక్కులపై ప్రతిఒక మహిళకు, బాలికలకు అవగాహన ఉండాలని మహిళ సాధికారత జిల్లా కోఆర్డినేటర్ యశోద అన్నారు. సోమవారం మండలంలోని గొట్కూరి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంద రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా మహిళ సాధికారత, సఖీ సేవలపై అవగాహన కల్పించారు. మహిళ చట్టాలు, లింగ వివక్ష, మహిళల సమానత్వం గురించి వివరించారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం వర్కర్ నాగమణి, పాఠశాల హెచ్‌ఎం గంగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ ధర్నా



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కైలాస్‌నగర్: అధికారిక అనుమతుల్లేకుండా లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. పాఠశాలల్లోనే పాఠ్య, నోట్ పుస్తకాలు విక్రయిస్తున్నారని మండిపడ్డారు. అదే విధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ.. తలిదండ్రులపై పెనుభారం మోపుతున్నారన్నారు. సమస్యలను జిల్లా విద్యాశాఖ అధికారికి విన్నవించినా.. పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మహేశ్, నిఖిల్, శివసాయి, విఘ్నేష్, కార్తీక్, సర్వజిత్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు ఉద్యోగులు

కైలాస్‌నగర్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ కోరారు. ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు రూ.18 వేలు, ఆయాలకు రూ.15 వేలు ఇవ్వాలన్నారు. గౌరవ వేతనం పొందుతున్న అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజెంగుల రాజు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ధరణి ఛాయ, ప్రధాన కార్యదరి చంద్రకళ, రుక్మిణి, సుశీల, సంగీత, రాధ, నివేదిక, దుర్గా, భాగ్యరేఖ, చారులత పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదం



బేల: మండలంలోని చంపెల్లి, సోన్‌కాస్, సదల్‌పూర్, జూనోని గ్రామాల వైపు నుంచి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వచ్చే ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో, విద్యార్థులతో కిక్కిరిస్తోంది. సోమవారం బస్సు ఫుల్‌గా నిండిపోవడంతో పుట్‌పాత్‌పై ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి, ప్రమాదకర ప్రయాణం చేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.